నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 28 సెప్టెంబర్ 2024 | MEDAK

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఆవిష్కరణ

నంగునూరులో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, సెప్టెంబర్ 27: తెలంగాణ ఉద్యమానికి కొండా లక్ష్మణ్ బాపూజీకి దగ్గరి సంబంధం ఉందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరులో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 109వ జయంతి రోజు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని 1969లోనే తన మంత్రి పదవికి రాజీనామా చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. 97 ఏండ్ల వయస్సులో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్షా చేపట్టిన వ్యక్తి అని కొనియాడారు.కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు డాక్టర్ సతీశ్, సంగు పురేందర్, రచ్చ సిద్దు, ఆకుబత్తిని రాము, దాసరి రవి, రామలింగం పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలకేంద్రంలో నిర్వహించిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజలకు మేలు చేసే పథకాలు కొనసాగిస్తాం

- త్వరలో కొత్త రేషన్, హెల్త్‌కార్డులు
- చేర్యాల ప్రాంత సమస్యలు పరిష్కరిస్తాం
- 242 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ
- దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

చేర్యాల, సెప్టెంబర్ 27: ప్రజలకు మేలు చేసే పథకాలు కొనసాగిస్తామని దేవాదాయశాఖ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని రేణుకాగార్డెన్‌లో శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన 242 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల వల్ల ఎన్నో కుటుంబాలకు మేలు జరిగిందని, అవే పథకాలను కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.త్వరలో ప్రజలకు కొత్త రేషన్,హెల్త్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తున్నదని, త్వరలో ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌కార్డు మంజూరవుతుందన్నారు.నియోజకవర్గానికి 3500 ఇండ్ల మంజూరు చేస్తున్నామని, త్వరలో వాటిని లబ్ధిదారులకు ఇస్తామన్నారు.ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వినతి పత్రం రూపంలో అందజేసిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

అభివృద్ధికి మంత్రి సహకరించాలి: పల్లా

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడారు. పార్టీలకతీతంగా గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి సహకరించిందని, అభివృద్ధికి నోచుకోని చేర్యాల ప్రాంతం పై మంత్రి కొండా సురేఖ ప్రత్యేక దృష్టిసారించి నిధులు మంజూరు చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు.ఇటీవల జరిగిన జిల్లా సమావేశంలో మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లిన కడవేర్గు వంతెన నిర్మాణం, ధూళిమిట్టలో సెంట్రల్ లైటింగ్ పనుల కార్యరూపం దాల్చినట్లు తెలిపారు.చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, చేర్యాలలో కోర్టు ప్రారంభించనున్న క్రమంలో సిబ్బందిని కేటాయించాలన్నారు.చేర్యాల–నాగపురి రోడ్డును శభాష్‌గూడెం వరకు డబుల్ రోడ్డుగా మార్చాలని, నిత్యం ఈ రహదారిలో ప్రమాదాలు జరిగి ప్రజలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దూరులో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించినా పట్టాలు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలని కోరారు.కొమురవెల్లి మల్లన్న ఆలయానికి 132 ఎకరాల భూమిని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందని, మల్లన్న భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దాని పై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలన్నారు.పార్టీలకతీతంగా చేర్యాల, జనగామ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో సదానందం, తహసీల్దార్ సమీర్‌అహ్మద్‌ఖాన్, లక్ష్మీనారాయణ,సంజీవ్‌కుమార్, మధుసూదన్, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణాగౌడ్, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, చెవిటి లింగం, పచ్చిమడ్ల సతీశ్, యాట కనకమ్మ,ముస్త్యాల తార, తుమ్మలపల్లి లీల పాల్గొన్నారు.

రుణమాఫీకి దసరా డెడ్‌లైన్

- కేసీఆర్ వచ్చిన తర్వాతే రైతుల విలువ, భూమి విలువ పెరిగింది..
- కరోనా విపత్తులోనూ రైతుబంధు ఆపలేదు..
- రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా నంగునూరులో రైతు ధర్నా

దసరాలోపు పంట రుణమాఫీ చేయకుంటే సచివాలయం ముట్టడిస్తాం

సిద్దిపేట జిల్లా నంగునూరులో నిర్వహించిన రైతు ధర్నాకు భారీగా హాజరైన రైతులు

సిద్దిపేట అర్బన్/నంగునూరు, సెప్టెంబర్ 27: దసరా పండుగలోపు రైతులందరికీ పంటరుణమాఫీ చేయాలని, లేదంటే సచివాలయం ముట్టడిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డెడ్‌లైన్ విధించారు. రైతు పంటరుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలకేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ మేరకు ధర్నాకు హాజరైన పలువురు రైతులతో ఆయన ముచ్చటించారు. రుణం ఎంత ఉంది..? ఎన్ని ఎకరాల భూమి ఉంది..? రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెబుతున్నారు..? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ఉన్నపుడు రైతులు ఏ విధంగా ఉన్నారు.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉందో అందరికీ అర్థమైందన్నారు. కేసీఆర్ రాకముందు ఎరువు బస్తా కావాలంటే ఉదయం ఐదు గంటలకు చెప్పులు లైన్‌లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేదన్నారు. ఎరువు బస్తాల కోసం రైతులను కాంగ్రెస్ లైన్‌లో నిలబెట్టిందని, కానీ కేసీఆర్ ప్రతి గ్రామానికి ఎరువుల లారీలు పంపించి రైతులకు అందించారన్నారు. కేసీఆర్ రాకముందు కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవని కేసీఆర్ వచ్చిన తర్వాత నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వస్తే.. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చాడన్నారు. నాటి సీఎం కేసీఆర్ రైతులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కరోనా సమయంలో కూడా రైతులకు రైతుబంధు వేసిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మరి నేడు పంట కోతకు వస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొని మూడు రోజుల్లో రైతులకు డబ్బులు అందించారన్నారు. మన దగ్గర కేసీఆర్ రాకముందు ఎకరానికి రూ.5 లక్షలు ఉంటే.. కేసీఆర్ వచ్చిన తర్వాత అన్ని రకాల సౌకర్యాలు కల్పించారన్నారు. రైతు విలువతో పాటు భూమి విలువ కూడా పెరిగిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతు విలువ తగ్గించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తర్వాతనే రైతులకు రెండు పంటలు పండుతున్నాయని గుర్తుచేశారు. ఎరువులకు, పంట పెట్టుబడికి బాధ లేదని, పండిన పంటను కొనేందుకు కూడా ఇబ్బంది లేకుండా కేసీఆర్ చేశారన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని మండిపడ్డారు. ప్రతి రైతుకూ పంటరుణమాఫీ చేయడంతో పాటు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తాను రాజీనామా చేస్తానని చెప్పానని, తన ఎమ్మెల్యే పదవి కంటే రైతుల రుణమాఫీయే తనకు ముఖ్యమన్నారు. నంగునూరు మండలంలో 11 వేల మంది రైతులు పంటరుణం తీసుకుంటే, కేవలం 5 వేల మందికి మాత్రమే మాఫీ జరిగిందన్నారు. ఇప్పటికైనా రైతులను, ప్రజలను మోసం చేయకుండా కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేముల వెంకట్ రెడ్డి, దువ్వల మల్లయ్య, ఎడ్ల సోంరెడ్డి, రాగుల సారయ్య, కోల రమేశ్, మహిపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి, వేణు, రవి, శ్రీకాంత్‌యాదవ్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, కమాల్ షరీఫ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరులో నిర్వహించిన ధర్నాకు తరలివచ్చిన మహిళా రైతులు

సిద్దిపేట జిల్లా నంగునూరులో నిర్వహించిన రైతు ధర్నాలో రుణమాఫీ చేయాలని ప్లకార్డు ప్రదర్శిస్తున్న మహిళా రైతు

అధికారులు మా చేతిలో ఏం లేదు అంటున్నరు..

నంగునూరు యూనియన్ బ్యాంకులో లక్ష రుణం ఉంది. బ్యాంకుకు వెళ్లా. వ్యవసాయ అధికారులను అడిగితే పైనుంచే రాలేదు.. మా చేతిలో ఏంలేదు అంటున్నరు. నాకు రెండు ఎకరాల భూమి ఉంది. ఎకరం వరిసాగుచేశా, మరో ఎకరంలో కంది సాగుచేశా. వరి కోతకు వచ్చినా ఇప్పుడు రైతుబంధు పైసలు కూడా రాలే. కేసీఆర్ సార్ ఉండగా పంటకు..పంటకు బరాబార్ రైతుబంధు పడ్డది.

– మమత, మహిళా రైతు, గట్లమల్యాల, సిద్దిపేట జిల్లా

రూ.80 వేల రుణం మాఫీ కాలే..

నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. నంగునూరు ఏపీజీవీబీలో రూ.80 వేల రుణం ఉంది. అయినా నాకు పంట రుణమాఫీ కాలే. బ్యాంకు అధికారులను అడిగితే ఇంకా రాలే అంటుర్రు. మొత్తం నాలుగు ఎకరాలు దొడ్డు రకం వడ్లు సాగు చేశా. ఇంతవరకు రైతుబంధు రాలే. ప్రభుత్వం అన్ని చెప్పింది.. కానీ ఇప్పుడు ఏం చేస్తలేదు.

– మాధవరెడ్డి, రైతు, కొండంరాజుపల్లి, సిద్దిపేట జిల్లా

బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 27: నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్య రంగాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, వివిధ బ్యాంకు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు పంటరుణమాఫీ పథకంలో కొన్ని బ్యాంకులు ఆధార్‌లో తప్పుల సవరణ, ఇతర కారణాలతో జాప్యం చేస్తున్నందున అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారుల పనితీరు మార్చుకోకుంటే వారిపై ఎస్ఎల్‌బీసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ఎస్‌హెచ్‌జీ లింకేజీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు ఈ సంవత్సరంలో ఎస్‌హెచ్‌జీలో 894 కోట్లకు 750 కోట్లు పూర్తికాగా మిగతా టార్గెట్ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పీఎం– స్వానిధి, పీఎం– విశ్వకర్మ ప్రక్రియ సైతం పూర్తిచేయాలన్నారు. ఈ సంవత్సరం సిద్దిపేట జిల్లా చంద్లాపూర్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలందిస్తున్నట్లు తెలిపారు. తునికికాస్ల గ్రామంలో కొత్త బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం లక్పతీ దీది పథకం ద్వారా ప్రతి ఎస్‌హెచ్‌జీ గ్రూపులో ఒకరికి లక్ష నుంచి ఐదు లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా లోన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ ఇన్ఫ్రా ఫండ్‌లో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా రెండోస్థానంలో నిలిచినందుకు నాబార్డు వారు అందించిన జ్ఞాపికను కలెక్టర్ చేతులమీదుగా ఎల్‌డీఎంకు అందజేశారు. సమావేశంలో ఎల్‌డీఎం హరిబాబు, ఆర్‌బీఐ ఐడీవో తాన్య, యుబీఐఆర్‌హెచ్ వికాస్, ఏపీజీవీబీ ఆర్ఎం ఉదయ్ కిరణ్, డీసీసీబీ డీజీఎం విశ్వేశ్వర్, టీజీబీఆర్ఎం బాలనాగు, ఆర్సెటి డైరెక్టర్ రాజలింగం, నాబార్డు డీడీఎం నికిల్ పాల్గొన్నారు.

సింగూరుకు కొనసాగుతున్న వరద

నిండుకుండలా సింగూరు ప్రాజెక్టు

పుల్కల్, సెప్టెంబర్ 27: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద మరింతగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. రోజురోజుకూ వరద పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 20,546 క్యూసెక్కులు వచ్చింది. అవుట్‌ఫ్లో 24,250 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ 29.857 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు. వరద వస్తున్నందున గొర్లకాపరులు, మత్స్యకారులు నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు.

'గీతం' విద్యార్థిని ఆత్మహత్య

పటాన్‌చెరు, సెప్టెంబర్ 27: గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో శుక్రవారం నాగల్లి వర్ష అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం... ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన విద్యుత్‌శాఖ ఉద్యోగి ఎన్.నాగరాజు కుమార్తె నాగల్లి వర్ష (19) గీతంలో బీటెక్ సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్నది. చదువులో ఎప్పుడు ముందుండే ఆమె శుక్రవారం ఉదయం క్లాసులకు హాజరై మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చింది. మధ్యాహ్నం రూమేట్స్ భోజనానికి వెళ్లిన తర్వాత తను రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మళ్లీ క్లాసులకు రావాల్సిన వర్ష రాకపోవడంతో స్నేహితులు వెళ్లి రూమ్‌లో చూస్తే హర్ష ఉరేసుకుని కనిపించింది. దీంతో డోర్స్ బలవంతంగా తెరిచి హర్షను దవాఖానకు తరలించారు. అప్పటికే హర్ష మరణించిందని డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని గీతం యాజమాన్యం పటాన్‌చెరు పోలీసులకు, హర్ష తల్లిదండ్రులకు తెలియజేసింది. హర్ష చదువులో ముందుంటుందని స్నేహితురాళ్లు తెలుపుతున్నారు. అయితే ఆమె ఎవరితో ఎక్కువ మాట్లాడకుండా లైబ్రరీలో ఎక్కువగా ఉండేదని, లేదంటే రూమ్‌కు వచ్చి చదువుకునేదని చెప్పారు. హర్షకు ఆత్మహత్య చేసుకునేంతగా ప్రేరేపించిన బలమైన కారణం మాత్రం వారు చెప్పలేకపోతున్నారు. పటాన్‌చెరు పోలీసులు హర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

రెండు బీవీఆర్ఐటీ బస్సులు ఢీకొని డ్రైవర్ మృతి

ఢీకొన్న రెండు బీవీఆర్ఐటీ కళాశాల బస్సులు

నర్సాపూర్,సెప్టెంబర్ 27: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన రెండు బస్సులు శుక్రవారం ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్, 20 మంది విద్యార్థులు గాయపడ్డారు. నర్సాపూర్ ఎస్సై లింగం వివరాల ప్రకారం.. బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన ఓ బస్సు విద్యార్థులను తీసుకొని హైదరాబాద్ నుంచి కళాశాలకు బయలుదేరింది. అదే క్రమంలో బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన మరొక బస్సు కళాశాల నుంచి నర్సాపూర్ వైపు వస్తున్నది. మార్గమధ్యలోకి రాగానే సంగారెడ్డి మార్గంలో గల క్లాసిక్ గార్డెన్ సమీపంలో కళాశాల వైపు వెళ్లే బస్సు డ్రైవర్ ఆటోను తప్పించబోయి ఎదురుగా వస్తున్న అదే కళాశాలకు చెందిన ఖాళీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బీరంగూడకు చెందిన నాగరాజు(50) అనే బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.అతన్ని నర్సాపూర్ దవాఖానకు తరలిస్తుండగా మారమధ్యలో మృతిచెందాడు. కొల్చారం మండల కేంద్రానికి చెందిన మరో డ్రైవర్ యాదగిరి బస్సులో ఇరుక్కుపోయాడు. అతని కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు. సంఘటనా స్థలాన్ని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం పరిశీలించారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్–సంగారెడ్డి మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు.

భూమి ఇవ్వలేదని కుల బహిష్కరణ

మెదక్ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బహిష్కరణకు గురైన కుటుంబం

మెదక్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఆలయానికి భూమి ఇవ్వడ లేదనే కక్షతో మెదక్ జిల్లా చేగుంట మండలం వల్లభాపూర్‌లో ఓ కుటుంబాన్ని కుల పెద్దలు గ్రామ బహిష్కరణ విధించారు. బాధితులు శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లోని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. బాధితుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా చేగుంట మండలం వల్లభపూర్‌కు చెందిన బత్తుల లింగయ్యకు గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయం వెనుక భాగంలో సర్వేనంబర్ 209/26లో 11 గుంటల భూమి ఉంది. ఆ భూమిలో 25 ఏండ్లుగా కాస్తూ చేస్తూ సాగులో ఉంటున్నారు. కానీ, ఆ 11 గుంటల భూమిని దేవాలయానికి ఇవ్వాలని యాదవ సంఘం కులస్తులు ఒత్తిడి తెస్తున్నారు. ఆ భూమిని యాదవ సంఘం కులస్తులు కలిసి తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఏ నక్క ఆధారం లేకుండా తమ భూమిలోకి వెళ్లి జేసీబీతో మా పంటలను, హద్దులను, పైపులైన్లను ధ్వంసం చేశారన్నారు. ఇదంతా ఎందుకు చేస్తున్నారని అడిగితే మీ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశామని సమాధానమిచ్చినట్లు బాధితులు వాపోయారు. మూడేండ్లుగా గ్రామంలోని మల్లికార్జునస్వామి జాతరలో బోనాలు తీయనివ్వడం లేదని వాపోయారు.గ్రామంలో జరిగే కార్యక్రమాలకు తమ కుటుంబాన్ని పిలవద్దని, తమతో మాట్లాడొద్దంటూ హుకుం జారీచేశారన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్తే వారితో తోటి పిల్లలు మాట్లాడకుండా చేశారని వాపోయారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో బత్తుల లింగయ్యకు చెందిన మొత్తం 9 మంది కుటుంబ సభ్యులు ఏడాదిన్నర క్రితం వల్లభపూర్ గ్రామాన్ని విడిచిపెట్టి చేగుంట మండలం నార్సింగిలో ఉంటున్నారు. మా సమస్యను గతంలో తహసీల్దార్లకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఆగస్టు 5న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. రామాయంపేట సీఐ తమ కులస్తులను పిలిపించి చెప్పినా వినడం లేదన్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అక్కడికి రానివ్వడం లేదన్నారు. శుక్రవారం నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, న్యాయం చేయాలని వేడుకున్నట్లు బాధితులు తెలిపారు.

ధరల అదుపులో కేంద్ర సర్కారు విఫలం

హుస్నాబాద్, సెప్టెంబర్ 27: నిత్యావసర ధరలను అదుపు చేయడం లో కేంద్రం పూర్తిగా విఫలమైందని, వెంటనే పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ మాట్లాడుతూ నిత్యావసర ధరలను పెంచి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. వంట నూనెలు, పప్పుల ధరలు పెరగడం వల్ల సాధారణ ప్రజలు కొనుగోలు చేయలేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ధరలు పెరగడంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఇంకా అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, బాలయ్య, రాజ్‌కుమార్, కుమారస్వామి, ప్రసాద్, అక్బర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలి


గోమారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- దాడికి ప్రతిదాడి చేసే నైజం మాదికాదు
- కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గౌరవాన్ని పాతరేశారు
- గోమారంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట, సెప్టెంబర్ 27 : కాంగ్రెస్ నాయకులు మాటిమాటికి బీఆర్ఎస్ నాయకులను రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని గోమారంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులకు కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై జరిగిన దాడిని బీఆర్ఎస్ నాయకులు ఖండిస్తే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉలిక్కి పడుతున్నారన్నారు. దాడులకు ప్రతిదాడులు చేసే నైజం మా పార్టీకి లేదన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని మదన్‌రెడ్డి పెట్టిన భిక్ష అని అనడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్, ప్రజలు ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా గెలిచిందని, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్ ఇచ్చిందే బీఆర్ఎస్ అని గుర్తించుకోవాలన్నారు. పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గౌరవాన్ని పాతరేశారని, భూదందాలు చేసుకునే నాయకులు కూడా ఎమ్మెల్యేను విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. బీఆర్ఎస్‌లో లేని వర్గపోరును సృష్టించేందుకు కాంగ్రెస్